సాక్షి
మంచిర్యాల
బుధవారం ‌। 9 ‌। ఆగస్టు ‌। 2023

అడవితల్లి బిడ్డలు



సంప్రదాయబద్ధమైన ఆచార వ్యవహారాలు, భిన్న సంస్కృతి ఆదివాసీల సొంతం. నేడు ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా అడవి తల్లి బిడ్డలపై ప్రత్యేక కథనం.

8లో▸

ఫిజియోథెరపీకి దరఖాస్తులు

మంచిర్యాలఅర్బన్: జిల్లాలో భవిత కేంద్రాల్లో(ఐఈఆర్‌సీ) ప్రత్యేక అవసరాల పిల్లలకు ఫిజియోథెరపీ సేవలు అందించటానికి స్టేట్ పారామెడికల్ బోర్డు ద్వారా బ్యాచ్‌లర్ ఆఫ్ ఫిజియోథెరపీ కోర్సు చేసిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు డీఈవో యాదయ్య తెలిపారు. ఈనెల 9 నుంచి 11లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
33.3 /25.5

ఆకాశం చాలా వరకు మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు సాధారణంగా నమోదవుతాయి. ఉక్కపోతగా ఉంటుంది. ఒకటిరెండు చోట్ల చినుకులు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తున్న ప్రభుత్వం



మాట్లాడుతున్న రజినీకాంత్

బెల్లంపల్లి: రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తోందని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శనిగారపు రజినీకాంత్ విమర్శించారు. జిల్లా విద్యారంగ సమగ్ర అభివృద్ధి కోసం చేపట్టిన జీపు యాత్రను మంగళవారం బెల్లంపల్లిలో ప్రారంభించారు. ఈసందర్భంగా పోచమ్మగడ్డ, బతుకమ్మ మైదానంలో నిర్వహించిన సభలో మాట్లాడారు. విద్యార్థుల స్కాలర్‌షిప్, ఫీజు బకాయిలు చెల్లించకుండా తీవ్ర కా లయాపన చేస్తోందన్నారు. గడిచిన మూడేళ్లలో బకాయిలు రూ.5,177 కోట్లకు చేరాయన్నారు. సంక్షేమ వసతి గృహాలు సమస్యలకు నిలయంగా మారాయని పేర్కొన్నారు. శిథి లావస్థలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు పక్కా భవనాలు నిర్మించాలని కోరారు. జిల్లాలో ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాలను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలని, ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని, ఫీజు నియంత్రణ చట్టం అమలు చేయాలని కోరారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీకాంత్, తిరుపతి, నాయకులు అభినవ్, సత్యనారాయణ, రాకేష్, రాజు, సంజయ్, సాయి గణేశ్, సాయికిరణ్, కృష్ణ పాల్గొన్నారు.

క్రమబద్ధీకరణ దరఖాస్తులపై క్షేత్ర పరిశీలన



వివరాలు తెలుసుకుంటున్న ఆర్డీవో

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలంలోని గ్రామాల్లో క్రమబద్ధీకరణ కోసం 58, 59 జీవో కింద దరఖాస్తు చేసుకున్న వారి భూములను ఆర్డీవో రాములు మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. దరఖాస్తులను పరిశీలిస్తూ నిబంధనలకు అనుగుణంగా వివరాలు ఆరా తీస్తూ ఇంటి స్థలాలను పరిశీలించారు. ప్రభుత్వ భూముల్లో ఇళ్లు నిర్మించుకున్న స్థలాల క్రమబద్ధీకరణకు సంబంధించి స్థానిక రెవెన్యూ, పంచాయతీ అధికారుల ద్వారా ఆరా తీశారు. ఆర్డీవో వెంట నాయబ్ తహసీల్దార్ హరిత, ఆర్‌ఐ లావణ్య, మండల సర్వేయర్ కృష్ణప్రియ ఉన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికులకు చీరల పంపిణీ



చీరలు అందిస్తున్న డీఈవో యాదయ్య

మంచిర్యాలఅర్బన్: బెంగళూర్ కేంద్రంగా నిర్వహిస్తున్న శ్రీసత్యసాయి అన్నపూర్ణ ట్రస్టు వ్యవస్థాపకుడు సద్గురు మధుసూదనసాయి 44వ పుట్టిన రోజు సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులకు చీరలు పంపిణీ చేయాలని నిర్ణయించారు. ఈమేరకు జిల్లాలోని 758 పాఠశాలల్లో పనిచేసే 1,192 మంది కార్మికులకు అందజేయనున్నారు. మంచిర్యాల బాలుర ఉన్నత పాఠశాలలో డీఈవో యాదయ్య ఆయా మండలాలకు చెందిన ఎంఈవో, ఉపాధ్యాయులకు చీరలు అందించారు. కార్యక్రమానికి జిల్లా సెక్టోరియల్ అధికారి చౌదరి, సత్యనారాయణమూర్తి మంచిర్యాల ఎంఈవో పోచయ్య పాల్గొన్నారు.

ఆర్టీసీ అమరులకు నివాళి



అమరులకు నివాళులర్పిస్తున్న కార్మికులు

మంచిర్యాలఅర్బన్: టీఎస్‌ఆర్టీసీ ఉద్యమంలో అమరులైన వారికి మంచిర్యాల ఆర్టీసీ డిపో వద్ద మంగళవారం డిపో కార్మికులు నివాళులర్పించారు. ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం విజయాన్ని అమరులకు అంకితం చేస్తున్నామని కార్మికులు ప్రకటించారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నేతలు, కార్మికులు పాల్గొన్నారు.

వెలమ కోటలో బీసీనాదం !



తెలంగాణ బీసీ జాగృతి నిర్వహించిన 'మంచిర్యాల నియోజకవర్గం-బీసీ ఎమ్మెల్యే' అంశంపై రౌండ్ టేబుల్ సమావేశంలో బీసీ నాయకులు (ఫైల్)

- 'మంచిర్యాల'టికెట్ కోరుతున్న నేతలు
- చాన్స్ కోసం పార్టీలకు వినతులు
- సభలు, సమావేశాలు నిర్వహిస్తున్న నాయకులు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: జిల్లాలోని ఏకైక జనరల్ అసెంబ్లీ నియోజకవర్గం మంచిర్యాల. ఏళ్లుగా వెలమల చేతిలో ఉన్న ఈ స్థానంపై ఈసారి బీసీలు నజర్ వేశారు. బీసీలకే ఇక్కడ అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. ప్రధాన ఓటు బ్యాంకుగా ఉన్న కాపు, పెరిక, పద్మశాలి, గౌడ, యాదవ, ముదిరాజ్, రజక తదితర వర్గాల నుంచి తమకు టికెట్ ఇవ్వాలనే వినతులు పార్టీల అధిష్టానాలకు వినతులు వెళ్తున్నాయి. ఇప్పటికే కొందరు నాయకులు అధిష్టానంతో సంబంధం లేకుండా వచ్చే ఎన్నికల్లో కచ్చితంగా పోటీ చేస్తామని బహిరంగంగానే ప్రకటిస్తున్నారు. ఓవైపు రాజకీయ పార్టీలు సర్వేలు, ప్రజాభిప్రాయ సేకరణలు చేపడుతున్నాయి. టికెట్ల పందేరంలో గెలుపు గుర్రాల కోసం కసరత్తు చేస్తున్నాయి. మరోవైపు వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో మంచిర్యాల స్థానం బీసీలకే ఇవ్వాలని, చర్చలు, సమావేశాలు, జరుగుతున్నాయి. బీసీ సంఘాలు రాజకీయ పార్టీలను కోరుతున్నాయి.

బీసీ లీడర్ల ఆరాటం

ప్రధాన పార్టీల్లో పని చేస్తున్న బీసీ నాయకులు తమకు అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. కాంగ్రెస్‌లో ప్రతీ లోక్‌సభ పరిధిలో రెండు శాసనసభ స్థానాలు బీసీలకు కేటాయిస్తామనే ప్రకటనపై ఆశలు పెట్టుకున్నారు. ఆ ఫార్ములా ప్రకారం పెద్దపల్లి పరిధిలో మంచిర్యాల, మంథని, రామగుండం, పెద్దపల్లి నియోజకవర్గాల అభ్యర్థుల ఎంపిక ఇక్కడి బీసీ అభ్యర్థిత్వంపై పడనుంది. ఇప్పటికైతే రాష్ట్రంలోనే కీలక నేతగా ఉన్న మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్‌సాగర్ రావుకే అవకాశం ఉంటుందనే వాదనలు ఉన్నాయి. ఒకవేళ అభ్యర్థిని మార్చి బీసీలకు అవకాశం ఇస్తే చిట్ల సత్యనారాయణ, ఇటీవల పార్టీలో చేరిన డా.నీలకంఠేశ్వరరావు, లక్షెట్టిపేట జెడ్పీటీసీ సత్తయ్య తదితరులు ఆశలు పెట్టుకున్నారు. ఇక బీజేపీ నుంచి ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్, సీనియర్ నాయకులు ముల్కల మల్లారెడ్డి ప్రధానంగా ఉన్నారు. బీసీలవైపు చూస్తే, తుల మధుసూదన్‌రావు పోటీ చేయాలనంటున్నారు. ఇక అధికార పార్టీ బీఆర్‌ఎస్‌లో సిట్టింగ్ ఎమ్మెల్యేను మార్చితే బీసీ కోటాలో మంచిర్యాల మున్సిపల్ వైస్‌చైర్మన్ గాజుల ముఖేశ్‌గౌడ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పల్లె భూమేశ్, నస్పూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ తోట శ్రీనివాస్, అక్కల తిరుపతివర్మ, మహిళ నాయకురాలు అత్తి సరోజ తదితరులు టికెట్ ఆశిస్తున్నారు. వీరితోపాటు ప్రజాసంఘాల నాయకులు, వైద్యులు, పలుకుబడి ఉన్న బీసీలు సైతం టికెట్ అవకాశం ఉంటే పార్టీ తీర్థం పుచ్చుకునే యోచనలో ఉన్నారు. వీరిలో ట్రస్మా అధ్యక్షుడు రాపోలు విష్ణువర్ధన్‌రావు, బీజేపీలో చేరేందుకు సిద్ధంగా ఉన్న ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు డా.రఘునందన్‌రావుతోపాటు జిల్లా కేంద్రంలోని పలువురు బీసీ వ్యాపారులు తమ అదృష్టం పరీక్షించుకునేందుకు సిద్ధపడుతున్నారు.

ఇదీ నియోజకవర్గ చరిత్ర..

1952-57లో ఇద్దరు సభ్యులకు అవకాశం ఉండేది. మొదటిసారిగా సూరే విశ్వనాథరావు (బ్రాహ్మణ), కోదాటి రాజమల్లు(ఎస్సీ)ఇద్దరు ఎన్నికయ్యారు. ఆ తర్వాత 1957 నుంచి 2018 వరకు పరిశీలిస్తే, 1978-83 ఎన్నికల్లో జనతా పార్టీ నుంచి చుంచు లక్ష్మయ్య ఒక్కరే బీసీ(పెరిక) నుంచి ఎన్నికయ్యారు. అప్పటికే ఆయన మూడుసార్లు ఓటమిపాలై, కాంగ్రెస్‌లో వచ్చిన చీలికతో తర్వాత జరిగిన ఎన్నికల్లో బయటపడ్డారు. ఇక 2009-10, 2010-14(ఉప ఎన్నిక)లో టీఆర్‌ఎస్ నుంచి నుంచి రెడ్డి సామాజికవర్గం నుంచి గడ్డం అరవింద్‌రెడ్డి ఎన్నికయ్యారు. మిగతా అన్ని ఎన్నికల్లోనూ వెలమ సామాజికవర్గం వారికే అవకాశం దక్కింది. మొత్తం 17 మంది మంచిర్యాల నుంచి అసెంబ్లీకి ఎన్నికయ్యారు. వీరిలో 12 మంది వెలమలు కాగా, ఐదుగురు ఇతరులు. లక్సెట్టిపేట నియోజకవర్గం నుంచి 2009లో మంచిర్యాల ఏర్పాటై, నేటి వరకు వెలమలకు పెట్టని కోటలా మారింది.

బీసీలు పోటీ చేసింది తక్కువే

ప్రధాన పార్టీలు బీసీలకు బీఫాం ఇచ్చి ప్రోత్సహించింది తక్కువే. గత మూడు ఎన్నికలే తీసుకుంటే, 2009, 2014, 2018 ఎన్నికల్లో ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్ బీసీలకు అవకాశం ఇవ్వలేదు. 2009లో ప్రజారాజ్యం పార్టీ నుంచి బీసీగా ఉన్న కర్రె లచ్చన్నకు అవకాశం దక్కింది. ఆ ఎన్నికల్లో ఆయన 14 వేల ఓట్లతో మూడో స్థానంలో నిలిచారు. ప్రధాన పార్టీల నుంచి టికెట్లు పొందలేక కొందరు బీసీ నాయకులు స్వతంత్రంగా పోటీ చేస్తున్నారు. అయితే చెప్పుకోదగిన ఓట్లు రావడం లేదు. వచ్చే ఎన్నికల్లో వెనుబడిన తరగుతుల నాయకులకు రాజకీయ పార్టీల టికెట్లు ప్రకటిస్తారా? అనే చర్చమాత్రం జోరుగా సాగుతోంది.

ఐదు రోజులు.. 54 దరఖాస్తులు

సాక్షి, ఆదిలాబాద్: నూతన మద్యం పాలసీ (2023-25)కి సంబంధించిన దరఖాస్తుల స్వీకరణ ఈనెల 4న ప్రారంభమైంది. ఐదు రోజులు గడుస్తున్నా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఈ ప్రక్రియ మందకొడిగా సాగుతుంది. మంచిర్యాల మినహా మిగతా మూడు జిల్లాల్లో ఇప్పటి వరకు సింగిల్ డిజిట్‌లోనే దరఖాస్తులు వచ్చాయి. మంచి రోజులు లేకపోవడంతో దరఖాస్తుదారులు సెంటిమెంట్‌గా ముందుకు రావడం లేదని భావిస్తున్నారు. ఈనెల 15వ తేదీతో అధిక మాసం ముగుస్తుందని ఆ తర్వాత మూడు రోజులు దరఖాస్తుకు అవకాశం ఉండటంతో అప్పుడు భారీగా వచ్చే అవకాశం ఉందని అబ్కారీ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.

మంచిర్యాలలోనే అధికం

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 192 మద్యం దుకాణాలకు గాను మంగళవారం వరకు 54 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. జిల్లాల వారీగా పరిశీలిస్తే ... మంచిర్యాలలో 43, ఆదిలాబాద్‌లో నాలుగు, ఆసిఫాబాద్‌లో 5, నిర్మల్‌లో రెండు ఉన్నాయి.

గ్రూపులుగా దరఖాస్తుకు ఆసక్తి

దరఖాస్తు ఫీజు రూ.2లక్షలు ఉండటం, అదీ నాన్ రిఫండబుల్ కావడంతో సింగిల్గా దరఖాస్తు చేసుకునేందుకు వెనుకా ముందు అవుతున్నారు. గ్రూపుగా దరఖాస్తు చేసుకునేందుకు సిద్ధమవుతున్నారు.

రాజకీయాలకు అతీతంగా వర్గీకరణ పోరాటం



రామకృష్ణాపూర్‌లో అమరవీరుల స్తూపం వద్ద మాట్లాడుతున్న మంద కృష్ణ

- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ

బెల్లంపల్లి/రామకృష్ణాపూర్/మందమర్రి రూరల్: ఎస్సీ వర్గీకరణ కోసం రాజకీయాలకు అతీతంగా పోరాడాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ కోరారు. ఈ నెలాఖరున హైదరాబాద్‌లో నిర్వహించనున్న మాదిగల విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని జిల్లాల్లో పర్యటిస్తున్న మందకృష్ణ మంగళవారం చెన్నూర్, రామకృష్ణాపూర్, మందమర్రి, బెల్లంపల్లిలో సన్నాహక కార్యక్రమాలు నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహాలకు పూలమాల వేసి నివాలులర్పించారు. రామకృష్ణాపూర్ రామాలయం సమీపంలోని అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించారు. ఎస్సీ వర్గీకరణ కోసం 29 ఏళ్లుగా పోరాటం చేస్తున్నామన్నారు. బీజేపీ, కాంగ్రెస్, బీఆర్‌ఎస్ తదితర పార్టీలు చిత్తశుద్ధితో వ్యవహరించకుండా మాదిగలను దగా చేశాయని మండిపడ్డారు. వర్గీకరణపైనే మాదిగల భవిష్యత్ ఆధారపడి ఉందనేది గ్రహించాలని సూచించారు. ఆయా రాజకీయ పార్టీల్లో పనిచేస్తూ నాయకులను గెలిపించడం కాదని, వర్గీకరణ కోసం ఉద్యమానికి సిద్ధం కావాలని సూచించారు. పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణ బిల్లు పెడితే వచ్చే ఎన్నికల్లో బీజేపీని బలపరుస్తామని తెలిపారు. ఇచ్చిన మాటలు తప్పే కేసీఆర్‌ను మాదిగలు నమ్మొద్దని సూచించారు. తెలంగాణ రాష్ట్రసాధనలో అత్యధిక మంది అమరులైంది, జైలుకెళ్లింది, సాంస్కృతిక ఉద్యమాన్ని నిర్మించింది మాదిగలేనని గుర్తుచేశారు. త్వరలో రాష్ట్రంలో జరుగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో మాదిగలకు 15 నియోజకవర్గాల్లో అన్ని రాజకీయ పార్టీలు టికెట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. మాదిగలను నిర్లక్ష్యం చేసే పార్టీలు వచ్చే ఎన్నికల్లో మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ఈనెలాఖరులో హైదరాబాద్‌లో తలపెట్టిన మాదిగల విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమాల్లో కాంగ్రెస్ నాయకులు రామిళ్ల రాధిక, దాసారపు శ్రీనివాస్, ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ చెన్నూరి సమ్మయ్య, నాయకులు మల్లారపు చిన్నరాజం, డి.ఎల్లయ్య, మిట్టపల్లి మల్లయ్య, గోగర్ల శేఖర్, రాజలింగు, ఏక్‌నాథ్, నక్క కృష్ణ, ముల్కల చంద్రయ్య, జీడి సారంగం, పెరుక నర్సయ్య పాల్గొన్నారు.

బాధ్యతగా మొక్కలను సంరక్షించాలి

- సీసీఎఫ్ వినోద్‌కుమార్



కోనంపేట ప్లానిటేషన్‌ను పరిశీలిస్తున్న సీసీఎఫ్

నెన్నెల: మొక్కల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని బాధ్యతగా మొక్కలను కాపాడాలని చీఫ్ కన్జర్వేటర్ ఫారెస్ట్ (సీసీఎఫ్) వినోద్‌కుమార్ అధికారులకు సూచించారు. కుశ్నపల్లి రేంజ్ పరిధిలోని కోనంపేట, కుశ్నపల్లి గ్రామాల్లోని అటవీ ప్లానిటేషన్‌ను మంగళవారం పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎండిపోయిన మొక్కల స్థానంలో కొత్త మొక్కలు నాటాలన్నారు. పెరుగుదల లేని మొక్కలను తొలగించి వాటి స్థానంలో పెద్ద మొక్కలు నాటాలని ఆదేశించారు. అటవీ ప్రాంతంలో నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, వన్యప్రాణుల రక్షణకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలన్నారు. అటవీ శాఖ చేపడుతున్న అడవుల రక్షణ చర్యలు, ఎదుర్కొంటున్న సవాళ్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కుశ్నపల్లిలో 10 హెక్టార్లు, కోనంపేటలో 15 హెక్టార్లలోని ప్లానిటేషన్‌పై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. సీసీఎఫ్ వెంట బెల్లంపల్లి ఎఫ్‌డీవో వినయ్‌కుమార్‌సాహూ, కుశ్నపల్లి రేంజ్ అధికారి గోవింద్‌చంద్‌సర్దార్, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్లు మల్లయ్య, రాజేశ్, బీట్ ఆఫీసర్లు శ్రీనివాస్, శ్రీనాథ్, రజిని ఉన్నారు.

మహిళా ఆరోగ్యకార్యకర్తల భర్తీ నోటిఫికేషన్ రద్దు చేయాలి



నిరసన తెలుపుతున్న 2వ ఏఎన్‌ఎంలు

పాతమంచిర్యాల: వైద్య ఆరోగ్యశాఖలో మహిళా ఆరోగ్య కార్యకర్తల భర్తీ నోటిఫికేషన్ రద్దు చేయాలని తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు మంజుల కోరారు. జిల్లాలో పని చేస్తున్న సెకండ్ ఏఎన్‌ఎంలు జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో మంగళవారం వంటావార్పు నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మంజుల మాట్లాడుతూ 20 ఏళ్లుగా కాంట్రాక్టు ఏఎన్‌ఎంలుగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పని చేస్తున్నామని, తమ ఉద్యోగాలు పర్మినెంట్ చేయకుండా ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేయడాన్ని తప్పు పట్టారు. తాజా నోటిఫికేషన్‌తో తమ ఉద్యోగాలకు ముప్పు ఏర్పడిందన్నారు. 20 ఏళ్ల సీనియారిటీ ప్రకారం తమను ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నోటిఫికేషన్ రద్దు చేయకుంటే ఈనెల 15 నుంచి సమ్మె చేస్తామని హెచ్చరించారు. నిరసనలో సెకండ్ ఏఎన్‌ఎంలు తిరుమల, పద్మ, ఆదిలక్ష్మి, సరోజ, సత్యవతి, స్వప్న, సులోచన తదితరులు పాల్గొన్నారు.

కుష్ఠు నివారణకు ప్రత్యేక చర్యలు

- అదనపు కలెక్టర్ మోతీలాల్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మోతీలాల్, అధికారులు

నస్పూర్: జిల్లాలో కుష్ఠు వ్యాధి నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని అదనపు కలెక్టర్ మోతీలాల్ తెలిపారు. సమీకృత కలెక్టరేట్‌లో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సుబ్బారాయుడు, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉపసంచాలకులు పి.రవీందర్‌రెడ్డితో కలిసి కుష్ఠు వ్యాధి నిర్మూలన కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలు, పోస్టర్లు, బుక్‌లెట్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ కుష్ఠు నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ఈనెల 16 నుంచి 31 వరకు కుష్ఠు వ్యాధిగ్రస్తుల గుర్తింపు ఉద్యమం - 2023 నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈమేరకు జిల్లాలో 737 బృందాలను ఏర్పాటు చేశామన్నారు. ఈ బృందాలు గ్రామాల్లో ప్రతీ ఇంటింటికీ తిరిగి వ్యాధిగ్రస్తులను గుర్తించి వారికి అవగాహన కల్పిస్తారని తెలిపారు. ఈనెల 10 నుంచి బోద వ్యాధి నివారణకు మాస్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ మాత్రలు పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. బోద నివారణకు అందరూ ఈ మాత్రలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపవైద్యాధికారి డాక్టర్ విజయనిర్మల, ప్రోగ్రామింగ్ అధికారి డాక్టర్ ఫయాజ్, డాక్టర్ అనిత, జిల్లా మాస్ మీడియా అధికారి వెంకటేశ్వర్లు, సబ్‌యూనిట్ అధికారి నాందేవ్, డీపీఎంవో శివకుమార్, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

ఆగని ఆత్మహత్యలు

- ట్రిపుల్‌ఐటీలో మరో విద్యార్థి బలవన్మరణం
- క్లాసులకు హాజరైన రెండోరోజే ఘటన
- మృతుడిది సంగారెడ్డి జిల్లా కేంద్రం
- ఎనిమిది నెలల్లో నాలుగో ఘటన
- జిల్లా ఆస్పత్రికి విద్యార్థి మృతదేహం
- వివిధ పార్టీలు, సంఘాల ఆందోళన



జాదవ్ బబ్లూ (ఫైల్)



టీజేఏసీ విద్యార్థి విభాగం అధ్యక్షుడిని బలవంతంగా తరలిస్తున్న పోలీసులు

భైంసా: బాసర ట్రిపుల్‌ఐటీలో విద్యార్థుల ఆత్మహత్యలు ఆగడంలేదు. మంగళవారం మరో విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కళాశాలలో ఇటీవలే చేరిన సంగారెడ్డి జిల్లా నారాయణ్‌ఖేడ్ మండలం నాగాపూర్ గ్రామానికి చెందిన జాదవ్ బబ్లూ (16) మంగళవారం ఆత్మహత్య చేసుకున్నాడు. ఇటీవలే పీయూసీ-1లో ప్రవేశం పొందిన బబ్లూ ఈనెల 31న క్యాంపస్ అధికారులు నిర్వహించిన ఓరియంటేషన్‌కు హాజరయ్యాడు. సోమవారం నుంచి తరగతులు ప్రారంభించగా మంగళవారం హాస్టల్‌గదిలో ఉరేసుకున్నాడు. విషయం తెలుసుకున్న క్యాంపస్ అధికారులు ఆస్పత్రికి తరలించేలోపే అపస్మారకస్థితికి చేరుకుని మృతి చెందాడు. విద్యార్థి మృతదేహాన్ని నిర్మల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కాగా, బబ్లూ మృతికి గల కారణాలు తెలియరాలేదు. విద్యార్థి ఆత్మహత్య విషయం తెలియగానే వివిధ విద్యార్థి సంఘాలు, పార్టీలు ఆందోళనకు దిగాయి. కాగా, అధికారులు క్యాంపస్‌లోకి ఎవరినీ అనుమతించలేదు.

మధ్యాహ్నమే తల్లికి ఫోన్ చేసి..

సంగారెడ్డి జిల్లా నారాయణ్‌ఖేడ్ మండలం నాగాపూర్‌కు చెందిన జాదవ్ సంతోష్-రుక్మిణి దంపతులు సొంతూరు వదిలి సంగారెడ్డికి వచ్చి కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరికి నలుగురు సంతానం కాగా జాదవ్ బబ్లూ పెద్దవాడు. పేద కుటుంబంలో పుట్టిన బబ్లూ ఆందోల్ మండలం నేరేడిగుంట గ్రామంలో పదో తరగతి చదివి 9.5 జీపీఏతో ఉత్తీర్ణుడయ్యాడు. ఇటీవలే బాసర ట్రిపుల్‌ఐటీలో చేరాడు. మంగళవారం మధ్యాహ్నం తల్లి రుక్మిణికి ఫోన్ చేసి పలకరించాడు. సాయంత్రమే ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలిసి అతడి కుటుంబ సభ్యులంతా శోకసంద్రంలో మునిగిపోయారు.

ఎనిమిది నెలల్లో నాలుగో ఘటన

బాసర ట్రిపుల్‌ఐటీలో ఎనిమిది నెలల వ్యవధిలో నలుగురు విద్యార్థులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. గతేడాది డిసెంబర్‌లో ఒకరు, జూన్‌లో ఒక్కరోజు వ్యవధిలో ఇద్దరు, మంగళవారం జాదవ్ బబ్లూ ఆత్మహత్య చేసుకున్నారు. జూన్ 13న సంగారెడ్డికి చెందిన వడ్ల దీపిక ఆత్మహత్య చేసుకోగా ఈ ఘటనపై ఎన్నో అనుమానాలున్నాయి. అదేరోజు నలుగురు సభ్యులతో నిజనిర్ధారణ కమిటీ వేసినా ఇప్పటికీ ఆత్మహత్యకుగల కారణాలు బయటపెట్టకపోవడం ఎన్నో అనుమానాలకు తావిస్తోంది. జూన్ 14న అర్ధరాత్రి తర్వాత గంగా బ్లాక్ నాలుగో అంతస్తు పైనుంచి విద్యార్థిని లిఖిత దూకి చనిపోగా ఈ ఘటనపై ఎలాంటి అనుమానాలు లేవని కుటుంబ సభ్యులు, వర్సిటీ వర్గాలు చెబుతున్నా.. ఏదో మిస్టరీ ఉందన్న వాదనలూ బలంగా ఉన్నాయి. రాత్రి 2.30 గంటల సమయంలో లిఖిత బయటకు ఎందుకు వచ్చిందనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

విద్యార్థి మృతి బాధాకరం

బాసర ట్రిపుల్‌ఐటీలో పీయూసీ ఫస్టియర్ విద్యార్థి జాదవ్ బబ్లూ ఆత్మహత్యకు పాల్పడడం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. వ్యక్తిగత కారణాలతోనే అత డు ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని భావిస్తున్నాం. విద్యార్థులు మనోధైర్యాన్ని కోల్పోవద్దు. ఏవైన సమస్యలుంటే అధికారుల దృష్టికి తీసుకురావాలి.

– ప్రొఫెసర్ వెంకటరమణ, ఆర్జీయూకేటీ వీసీ

జిల్లాకేంద్రంలో ఉద్రిక్తత

- ట్రిపుల్‌ఐటీ విద్యార్థి మృతిపై కాంగ్రెస్ ఆందోళన
- కలెక్టర్ క్యాంప్ ఆఫీస్ ముట్టడికి యత్నం
- టీజేఏసీ విద్యార్థి విభాగం అధ్యక్షుడి అరెస్ట్
- బీజేపీ నేతల ఇళ్ల వద్ద నిర్బంధం



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న కాంగ్రెస్ నేతలు

నిర్మల్: బాసర ట్రిపుల్‌ఐటీ విద్యార్థి జాదవ్ బబ్లూ ఆత్మహత్యపై మంగళవారం రాత్రి ప్రతిపక్షాలు చేపట్టిన ఆందోళనలు, పోలీసుల బలవంతపు అరెస్టులతో జిల్లాకేంద్రంలో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ముందుగా జిల్లా ఆస్పత్రిలో ఆందోళన చేసిన కాంగ్రెస్ నేతలను పోలీసులు అరెస్ట్ చేసి సోన్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మళ్లీ కొందరు నాయకులు రాత్రి కలెక్టర్ క్యాంప్ కార్యాలయాన్ని ముట్టడించేందుకు యత్నించారు. దీంతో పోలీసులు వారిని బలవంతంగా అడ్డుకుని అదుపులోకి తీసుకున్నారు. కలెక్టర్‌ను కలిసేవరకు నిరసన ఆపమంటూ శ్రీహరిరావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ నేతలు భీష్మించడంతో చివరకు పోలీసు బందోబస్తు నడుమ కలెక్టరేట్‌కు తీసుకెళ్లారు. అక్కడ వారు కలెక్టర్ వరుణ్‌రెడ్డికి వినతిపత్రం అందించారు.

సిట్టింగ్‌జడ్జితో విచారణ జరిపించాలి

బాసర ట్రిపుల్‌ఐటీలో విద్యార్థుల ఆత్మహత్యలపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలని కలెక్టర్‌కు ఇచ్చిన వినతిపత్రంలో కాంగ్రెస్ నేత శ్రీహరిరావు డిమాండ్ చేశారు. దివంగత సీఎం వైఎస్సార్ పేద పిల్లల కోసం ఏర్పాటు చేసిన ట్రిపుల్‌ఐటీని సీఎం కేసీఆర్ కావాలని నాశనం చేస్తున్నారని ఆరోపించారు. ఇతర రాష్ట్రాల్లో పార్టీ విస్తరణపై ఉన్న శ్రద్ధ రాష్ట్రంలో విద్యార్థులపై లేదన్నారు. వెంటనే ట్రిపుల్‌ఐటీకి రెగ్యులర్ వీసీని నియమించాలని డిమాండ్ చేశారు.

పకడ్బందీగా వ్యవసాయ కమతాల గణన

- కలెక్టర్ బదావత్ సంతోష్

నస్పూర్: జిల్లాలో వ్యవసాయ కమతాల గణన పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ బదావత్ సంతోష్ సూచించారు. దేశంలో వ్యవసాయ స్థితి గతులను తెలుసుకోవడంతోపాటు అభివృద్ధి ప్రణాళిక, సామాజిక ఆర్థిక విధాన రూపకల్పనకు ప్రభుత్వం వ్యవసాయ గణన నిర్వహిస్తుందని తెలిపారు. గణాంక అధికారులకు మొబైల్ యాప్ ద్వారా పూర్తి అవగాహన కల్పించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈనెల 10న జిల్లా సిబ్బందికి గణనపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం చేపట్టనున్న సర్వేలో రైతులకు, కౌలు రైతులకు, పంటల విస్తీర్ణానికి సంబంధించిన పూర్తి వివరాలు సేకరిస్తారని వివరించారు. భూ కమతాల వారీగా రెవెన్యూ గ్రామాన్ని యూనిట్‌గా తీసుకుని సర్వే చేయడం జరుగుతుందని తెలిపారు. రైతుబంధు కోసం రైతుల ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా, భూమి విస్తీర్ణం వివరాలు సేకరించి అదనపు సమాచారాన్ని నమోదు చేస్తారని వెల్లడించారు. గ్రామాల్లో సాగు ఖర్చులు, యంత్రాల వినియోగం, ఎరువులు, విత్తనాలు, సేంద్రియ వ్యవసాయం, ప్రభుత్వ రాయితీలు ఇతర వివరాలు సేకరించి యాప్‌లో నమోదు చేస్తారని వివరించారు.

క్లుప్తంగా

విద్యుత్ షాక్‌తో ఎద్దు మృతి



మృతి చెందిన ఎద్దు

లక్సెట్టిపేట: మండలంలోని జెండావెంకటాపూర్‌తో తిరుపతి అనే రైతుకు చెందిన ఎద్దు మంగళవారం విద్యుత్ షాక్‌తో మృతి చెందింది. బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం గ్రామ శివారులోని పొలం వద్ద మేత మేస్తుండగా ట్రాన్స్‌ఫార్మర్‌కు తగలడంతో షాక్‌కు గురై మృతి చెందింది. ఎద్దు విలువ రూ.45 వేలు ఉంటుందని, ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని బాధిత రైతు కోరుతున్నాడు.

గొర్రెల మందపై కుక్కల దాడి



మృతి చెందిన గొర్రెలు

లక్సెట్టిపేట: మండలంలోని అంకతిపల్లిలో గొర్రెల మందపై కుక్కలు దాడి చేయడంతో పదిహేను గొర్రెలు మృతి చెందాయి. బాధితుడు తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం సోమవారం రాత్రి గొర్రెల దొడ్డిలోకి ఊరకుక్కలు చొరబడి గొర్రెలపై దాడి చేయడంతో 21 గొర్రెలకు తీవ్రగాయాలుకాగా 15 గొర్రెలు మృతి చెందాయి. సుమారు రూ.2 లక్షల వరకు నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.

విద్యుత్ షాక్‌తో ఒకరు మృతి

కాగజ్‌నగర్‌రూరల్: విద్యుత్‌షాక్‌తో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై రమేస్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని నజ్రూల్‌నగర్ విలేజ్ నెం.5 గ్రామానికి చెందిన కిరణ్ మిస్త్రి (57) సోమవారం రాత్రి ఇంట్లో విద్యుత్ మీటర్ ఫ్యూజు సరిచేస్తుండగా షాక్‌కు గురికావడంతో స్పృహతప్పి పడిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు కాగజ్‌నగర్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుని కుమార్తె దిరదేబి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

చోరీకి యత్నం.. బంధించిన కాలనీవాసులు



స్తంభానికి కట్టేసి ఉన్న యువకుడు

కాగజ్‌నగర్ టౌన్: పట్టణంలోని రెండో నంబర్ వార్డులో మంగళవారం చోరీకి యత్నిస్తున్న గుర్తు తెలియని యువకుడిని కాలనీవాసులు పట్టుకుని తాళ్లతో బంధించారు. వార్డు నం.2 (మార్కెట్ ఏరియా సమీపంలో) ఉదయం అనుమానాస్పదంగా తిరుగుతూ సదరు యువకుడు ఓ ఇంటి గేటు దూకేందుకు యత్నించాడు. కుటుంబ సభ్యులు కేకలు వేయగా కాలనీవాసులు యువకుడిని పట్టుకుని స్తంభానికి కట్టేశారు. అనంతరం పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అతడిని అదుపులో తీసుకుని విచారిస్తున్నారు.

అడవితల్లి బిడ్డలు..

కైలాస్‌నగర్/బజార్‌హత్నూర్: ఆదివాసీల జీవన వి ధానం ముఖ్యంగా పోడుభూములను సాగుచేస్తూ జీవనం కొనసాగించడం.. అడవుల్లో లభించే వనమూలికలు సేకరించి విక్రయిస్తూ అటవీ ఉత్పత్తులపై ఆధారపడి జీవనం సాగిస్తుంటారు. అయితే సంప్రదాయబద్ధమైన ఆచార వ్యవహారాలు, భిన్నంగా ఉండే సంస్కృతి ఆదివాసీల సొంతం. వాళ్లంతా సమాజానికి దూరంగా కొండ కోనల మధ్య జీవనం సాగిస్తారు. అడవే వారి ఆవాసం. ఇదీ ఆదివాసీల జీవన చిత్రం. ఆదివాసీలకు హక్కులు కల్పించేందుకు 1994 ఆగస్టు 9న ఐక్యరాజ్యసమితి ప్రపంచ ఆదివాసీ దినోత్సవంగా గుర్తించింది. నేడు ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

- ఆదివాసీల జీవనం.. సాంస్కృతిక వైవిధ్యం
- ప్రకృతిని ఒడిలో భిన్నమైన జీవన విధానం..
- సంస్కృతి, సంప్రదాయాలు, ప్రకృతిని పూజించడం వారి ప్రత్యేకత
- నేడు ప్రపంచ ఆదివాసీ దినోత్సవం



గుస్సాడీ నృత్యం చేస్తున్న ఆదివాసీలు (ఫైల్)

సంస్కృతి, సంప్రదాయాలు

ఆదివాసీ కళలు, సంస్కృతితోనే వారి జీవనం ముడిపడి ఉంది. జాతీయస్థాయిలో గుర్తింపు పొందిన గుస్సాడి దండారి వేడుక గిరిజనుల జీవనశైలిని ప్రతిబింబించే ప్రధాన పండగ. నెమలి ఈకలతో ప్రత్యేకంగా తయారు చేసిన టోపీలు, జంతు చర్మంతో తయారు చేసిన డప్పులు, డోలు, గుమేల, ఫరా లాంటి వాయిద్యాలతో పాటు గజ్జెలు, కోలాలు, మంత్ర దండం లాంటి రోకలి, తదితర సంప్రదాయ వస్తువులను గ్రామ పటేల్ ఇంటి ముందు ఉంచి వాటికి బలిదానం, ప్రత్యేక పూజలు, బోగి పండగ చేసి దండారి ఉత్సవాలు ప్రారంభిస్తారు. నెల రోజుల పాటు వేడుకలను అత్యంత వైభవంగా జరుపుకుంటారు. గుస్సాడి నృత్యానికి ఆద్యుడైన కనకరాజును కేంద్రం పద్మశ్రీతో సత్కరించి అవార్డును అందించడం ఈ కళకు ఉన్న ప్రత్యేకతను చాటుతోంది.

న్యాయ సలహా కేంద్రంగా రాయి సెంటర్లు

20 నుంచి 40 గిరిజన గ్రామాల పరిధిలో ఒక రాయి సెంటర్ ఉంటుంది. దీనికి గోండులు, కొలాం, పర్ధాన్, తోటి, నాయక్‌పోడ్, అంద్ గిరిజన తెగలు ప్రాతినిధ్యం వహిస్తాయి. ఆయా గ్రామాల్లోని పటేల్, దేవరి, మహాజన్, గట్యాల్ (గిరిజన జాతుల పెద్దలు) కలిసి 11 మంది కార్యవర్గంతో రాయిసెంటర్ ఏర్పడుతుంది. రాయిసెంటర్ పెద్దను సార్‌మేడి (అధ్యక్షుడు), ఉపమేడి(ఉపాధ్యక్షుడు), గీతాదార్(కార్యదర్శి), ఖజాన్‌దార్(కోశాధికారి), అవాల్‌దార్(సమాచారం), మిగిలినవారు సలహాదారులుగా వ్యవహరిస్తారు. ఉమ్మడి జిల్లాలో 120 రాయి సెంటర్లు ఉన్నాయి. వీటన్నింటిపై జిల్లాస్థాయిలో ఉట్నూర్‌లోని గుస్సాడిగుట్టలో జిల్లా రాయిసెంటర్ ఉంది. అక్కడి పెద్దను జిల్లా మేడి అని సంబోధిస్తారు. నెలకోసారి సమావేశాలు నిర్వహిస్తారు. గ్రామంలో కుటుంబ గొడవలు, ఆస్తి తగాదాలు, భార్యభర్తల గొడవలు, గిరిజనులకు సంబంధించిన అనేక సమస్యలను గ్రామ పటేల్ పరిష్కరిస్తారు. పరిష్కారం కానిపక్షంలో ఆ కేసును డివిజన్ రాయ్‌సెంటర్‌కు బదిలీ చేస్తారు. అక్కడా పరిష్కారం కాకుంటే జిల్లా స్థాయిలో ఉట్నూర్ గుస్సాడిగుట్ట రాయిసెంటర్‌కు బదిలీ చేస్తారు. ఆదివాసీల సమస్యల పరిష్కారంలో ఈ రాయిసెంటర్ల పాత్ర ఎంతో ప్రత్యేకమైంది.

ప్రత్యేక వేషధారణ

దండారి ఉత్సవాల్లో భాగంగా తొమ్మిది రోజుల పాటు గుస్సాడి వేషధారణ వేసిన వారు దండారి ముగిసేవరకూ స్నానం చేయరు. ఒంటికి బూడిద పూసుకుని స్నానంగా భావించడం వీరి ఆచారం. దీంతో పాటు ముఖానికి మసి, ఎడమ భుజంపై జింకతోలు, మెడలో రుద్రాక్షలు, కుడిచేతిలో మంత్రదండం(రోకలి), జంతువుల కొమ్ములు, నెమలి ఈకలతో చేసిన టోపీలు, కాళ్లకు గజ్జెలు, నడుముకు వస్తువుల సంచి వంటి విచిత్ర వేషధారణతో సంప్రదాయానికి ప్రతీకగా నిలుస్తారు.

సంప్రదాయాలు బలోపేతం

1943 నిజాం కాలం నుంచే రాయిసెంటర్లను వెలుగులోకి తెచ్చిన ఘనత మొదటి గిరిజన ఐఏఎస్ మడావి తుకారంకు దక్కుతుంది. ఉట్నూర్ మండలం లక్సెట్టిపేటకు చెందిన తుకారాం గిరిజన వ్యవహారాల్లో కీలకమైన షోడావాజన్(16 రకాల వాయిద్యాలు), అట్రడెమ్సంగ్(18 రకాల నృత్యాలు)లను పటిష్టం చేయడానికి విశేష కృషి చేశారు. రాయి సెంటర్లకు చట్టబద్ధత కల్పించారు.

ఉమ్మడి జిల్లాల వారీగా ఆదివాసీ జనాభా వివరాలు

జిల్లా	మండలాలు	షెడ్యుల్డ్ ఏరియా	నాన్ షెడ్యూల్డ్ ఏరియా
ఆదిలాబాద్	18	1,52,308	1,17,014
కుమురంభీం	15	83,459	50,347
మంచిర్యాల	18	11,496	45,294
నిర్మల్	19	-	80,576

ఆదివాసీల ప్రస్తుత స్థితిగతులు

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 9 ఆదివాసీ గిరిజన తెగలు ఉన్నాయి. గోండు, కొలాం, ప్రధాన్, కోయ, తోటి, మన్నెవార్, అంద్, నాయక్‌పోడ్, తదితర ఆదివాసీ తెగలు ఏజెన్సీ ప్రాంతాల్లో జీవనం సాగిస్తున్నాయి. ప్రపంచం రోజురోజుకూ ముందుకు దూసుకెళ్తున్నా ఆదివాసీల జీవనం మాత్రం ఇంకా వెనుకబడే ఉంది. స్వాతంత్రం వచ్చి దశాబ్దాలు గడుస్తున్నా వారి జీవన స్థితిగతులు నేటికీ అలాగే కొనసాగుతున్నాయి. కొమురం భీం, బిర్సాముండా, రాంజీగోండు పోరాటాల స్ఫూర్తితో ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ) ఏర్పాటు చేసుకుని నిరంతరం ఉద్యమాలు చేస్తునే ఉన్నారు.

ఆధ్యాత్మికతలోనూ వైవిధ్యమే

ఆదివాసీల జాతరలు, పండగల నిర్వహణలో వైవిధ్యం కన్పిస్తోంది. ప్రపంచంలోనే అతిపెద్ద గిరిజన జాతరల్లో కేస్లాపూర్ నాగోబా జాతర ఒకటి. ఏటా పుష్యమాస అమావాస్య రోజున ప్రారంభమయ్యే ఈ జాతరలో మెస్రం వంశీయులు తమ ఆరాధ్యదైవమైన నాగోబాను భక్తి భావంతో కొలుస్తూ పూజలు నిర్వహిస్తారు. రాష్ట్రంతో పాటు ఇతర ప్రాంతాల నుంచి సైతం లక్షలాదిగా ఆదివాసీలు తరలివచ్చి ప్రత్యేక పూజలు చేస్తారు. జై జంగో.. జైలింగో అనే భక్తిభావాన్ని చాటుతూ జంగుబాయి దీక్షలను సైతం ఎంతో నిష్టగా ఆచరిస్తారు.



అకాడి దేవతకు పూజలు చేస్తున్న ఆదివాసీ గిరిజనులు (ఫైల్)

సంస్కృతి, సంప్రదాయాలకు ప్రత్యేకత



ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలకు ప్రత్యేకత ఉంది. నేడు సాంకేతికంగా దేశం ఎంతగానో అభివృద్ధి చెందుతున్నా ఆదివాసీ గిరిజనులు మాత్రం తమ పూర్వీకులు అందించిన సంస్కృతి, సంప్రదాయాలను ఇప్పటికీ కాపాడుతున్నారు. దండారి పండుగను ఎంతో నియమ నిష్టలతో చేయడం గర్వకారణం.

– గొడం నగేష్, గిరిజన శాఖ మాజీమంత్రి

ఉత్సవాలు ఘనంగా జరుపుకోవాలి



ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దంపట్టేలా నేడు ఆదివాసీ దినోత్సవాన్ని అన్ని గూడేల్లో ఘనంగా జరుపుకోవాలి. విద్య, వైద్యం, సామాజికంగా ఆదివాసీలు అభివృద్ధి చెందే కార్యక్రమాలను ఐటీడీఏ ద్వారా చేపట్టాలి. ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలి.

– కనక రాజు, పద్మశ్రీ అవార్డు గ్రహీత, మార్లవాయి, జైనూర్

ఆదివాసీల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి



ఆదివాసీ గిరిజన గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. ఇప్పటికీ చాలా గ్రామాలకు రోడ్లు, రవాణా సౌకర్యాలు లేవు. వాగులు దాటి రాలేని గ్రామాలు ఎన్నో ఉన్నాయి. గిరిజన గ్రామాలు అన్నిరంగాల్లో అభివృద్ధి చెందినప్పుడే ఆదివాసీలకు సరైన గుర్తింపు.

– మెస్రం దుర్గు, రాయిసెంటర్ జిల్లా సార్‌మేడి, నార్నూర్

ఎర్రజెండా నీడలోనే కార్మిక హక్కుల సాధన

- ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డి సీతారామయ్య



మాట్లాడుతున్న వాసిరెడ్డి సీతారామయ్య

రెబ్బెన(ఆసిఫాబాద్): ఎర్రజెండా ఏఐటీయూసీ ద్వారానే సింగరేణి కార్మికుల హక్కులు సాధించబడుతాయని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. మంగళవారం గోలేటి టౌన్‌షిప్ లోని కేఎల్ మహేంద్ర భవన్‌లో గోలేటి బ్రాంచి 3వ మహాసభ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ కార్మికులకు మెరుగైన 11వ వేతన ఒప్పందాన్ని ఇటీవలే సాధించుకున్నామన్నారు. ఒకప్పుడు బొగ్గు గనులతో కళకళలాడిన బెల్లంపల్లి ఏరియాకు పూర్వ వైభవం తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. గోలేటి ఓసీపీని వెంటనే ప్రారంభించాలని, 11వ వేజ్‌బోర్డు ఏరియర్స్ ఆగస్టు నెల జీతాలతో కలిపి చెల్లించాలని, లాభాల వాటా 35 శాతం ప్రకటించాలని, ఎస్అండ్‌పీసీ సిబ్బందికి క్యాడర్ స్కీం ప్రమోషన్ 8 సంవత్సరాల నుండి 5 సంవత్సరాలకు తగ్గించాలని డిమాండ్ చేశారు. అనంతరం బ్రాంచి నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బ్రాంచి కార్యదర్శి ఎస్.తిరుపతి, బ్రాంచి ఇన్‌చార్జి చిప్ప నర్సయ్య, ఉపాధ్యక్షుడు బయ్య మొగిళి, ఆర్గనైజింగ్ కార్యదర్శులు జగ్గయ్య, శివరాం, చంద్రశేఖర్, రాజేశ్, దివాకర్, కిరణ్, ఆనంద్, రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు నిరంతరం చేపట్టాలి

- డీపీవో వెంకటేశ్వర్‌రావు



కిష్టాపూర్‌లో పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న డీపీవో వెంకటేశ్వర్‌రావు

జైపూర్: గ్రామాల్లో నిత్యం పారిశుధ్య పనులు చేపట్టాలని, రోడ్లపై చెత్తచెదారం లేకుండా చూడాలని జిల్లా పంచాయతీ అధికారి డి.వెంకటేశ్వర్‌రావు సూచించారు. మండలంలోని కిష్టాపూర్ గ్రామాన్ని మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో కొనసాగుతున్న పారిశుధ్య పనులను పరిశీలించి సూచనలు చేశారు. ప్రతీరోజు రోడ్లు, మురికి కాలువలను శుభ్రం చేయాలన్నారు. గ్రామ పంచాయతీ ట్రాక్టర్ ద్వారా ఇంటింటా చెత్త సేకరించాలని తెలిపారు. రోడ్లపై వర్షపు నీరు నిలవకుండా చూడాలని, దోమల నివారణకు ఫాగింగ్, బయోటెక్ స్ప్రే చేయాలని వివరించారు. అనంతరం డంప్ యార్డును పరిశీలించి కంపోస్ట్ ఎరువు తయారీ ప్రక్రియ చేపడుతూ కంపోస్ట్ షెడ్డు ద్వారా వచ్చే ఎరువును పల్లెప్రకృతి వనంలోని మొక్కలకు అందించాలని సూచించారు. ఆయన వెంట మండల పంచాయతీ అధికారి అనిల్‌కుమార్, సర్పంచ్ చందుపట్ల పద్మజ, పంచాయతీ కార్యదర్శి ప్రశాంత్, తదితరులు ఉన్నారు.

ప్రైవేట్ కంపెనీకి రూ.10 లక్షలు జరిమానా

గుడిహత్నూర్(బోథ్): మండల కేంద్రానికి చెందిన శహనే మాధవ్ కొల్హారీ శివారులోని తన చేనులో 2020 మే నెలలో అగ్రి విట్రో టెక్ లేబరేటరీస్, హైదరాబాద్ కంపెనీ వారి వద్ద 4,322 అరటి మొక్కలను కొనుగోలు చేసి తన రెండున్నర ఎకరాల్లో నాటాడు. సగానికి పైగా మొక్కలు ఎదుగుదల లేక కాత కాయలేదు. దీంతో తెలంగాణ వినియోగదారుల సంఘాల సమైఖ్య క్యాట్కో అనుబంధ సంఘం ఏసీఎఫ్ వినియోగదారుల సంఘం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు ఎల్చల్‌వార్ సత్యనారాయణను కలిసి తన గోడు వెల్లబోసుకున్నాడు. పంటను పరీక్షించి నివేదిక ఇవ్వాలని జిల్లా ఉద్యానవన శాఖ అధికారులను కోరాడు. సీనియర్ శాస్త్రవేత్త వి.సుచిత్ర పంట క్షేత్రాన్ని పరిశీలించి నాసిరకం మొక్కలు ఇవ్వడం వల్లే పంట వైరల్ ఇన్‌ఫెక్షన్‌కు గురైందని నివేదిక ఇచ్చారు. దీనిని ఆధారంగా చేసుకుని ఉమ్మడి జిల్లా కన్స్యూమర్ కోర్టులో బాధితునికి రూ.15లక్షల నష్ట పరిహారం కోరుతూ న్యాయవాది కె.విశ్వనాథ్ జూలై 17, 2021లో కేసు దాఖలు చేశారు. కన్స్యూమర్ కోర్టు విచారణ జరిపి సదరు కంపెనీ రూ.10లక్షలు నష్టపరిహారం చెల్లించాలని బాధిత రైతు శాహనే మాధవ్‌కు అనుకూలముగా గత నెల 25న తీర్పునివ్వగా ఈ నెల 08న అధికారికంగా ప్రకటించింది. తీర్పుపై ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వినియోగదారుల సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి.

కడెం కాలువలో మృతదేహం లభ్యం

జన్నారం: కడెం ప్రధాన కాలువ, కొత్తూరుపల్లి సమీపంలో మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై సతీశ్ తెలిపారు. దస్తురాబాద్ మండలం మల్లాపూర్‌కు చెందిన పశువుల కాపరి మాకు పెద్ద భీమయ్య (50) ఈ నెల 6న గేదెలను మేపేందుకు అడవికి వెళ్లి ఇంటికి తిరిగిరాలేదు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో దస్తురాబాద్ పోలీస్‌స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదు చేశారు. మంగళవారం సాయంత్రం జన్నారం ఎస్సై సతీశ్ సిబ్బందితో కలిసి కొత్తూరుపల్లి వైపు వెళ్తుండగా కాలువలో మృతదేహం కనిపించింది. జన్నారం మండలానికి చెందిన వారిది కాకపోవడంతో దస్తురాబాద్ పోలీసులకు సమాచారం అందించారు. అదృశ్యమైన వ్యక్తి కుటుంబ సభ్యులకు తెలపడంతో మృతదేహాన్ని పరిశీలించి భీమయ్యదేనని గుర్తించారు.

అక్రమంగా నిల్వ చేసిన ఇసుక సీజ్

జైపూర్(చెన్నూర్): మండలంలోని రసూల్‌పల్లి సమీపంలో అక్రమంగా నిల్వ చేసిన సుమారు 20 ట్రిప్పుల ఇసుకను సీజ్ చేసినట్లు తహసీల్దార్ రమేశ్ తెలిపారు. అనుమతి లేకుండా రసూల్‌పల్లి పెద్దవాగు నుంచి ఇసుకను తరలించి రసూల్‌పల్లి గ్రామ సమీపంలో నిల్వచేసినట్లు తమకు అందిన సమాచారం మేరకు తహసీల్దార్, ఆర్ఐ సంఘటన స్థలాన్ని సందర్శించి ఇసుకను సీజ్ చేసినట్లు తెలిపారు.

ఒకరికి 14 రోజుల రిమాండ్

మంచిర్యాలక్రైం: భార్యాభర్తల కేసులో కోర్టుకు హాజరు కాకుండా తిరుగుతున్న వ్యక్తిని మంగళవారం నాన్‌బెయిలబుల్ వారెంట్ కింద అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం శ్రీరాంపూర్‌కు చెందిన రౌతు కార్తీక్, అతని భార్య సంధ్యారాణి మధ్య కుటుంబ, ఆస్తి తగాదాలు ఉన్నాయి. దీనిపై ఇద్దరి మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. దీంతో సంధ్యారాణి 2022 మే 7న స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడంతో కార్తీక్‌పై వేధింపుల కేసు నమోదైంది. అప్పటి సీఐ కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయగా నిందితుడు కోర్టుకు హాజరు కాకుండా ఆర్నెల్లుగా తప్పించుకు తిరుగుతున్నాడు. దీంతో కోర్టు నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. మహిళా పోలీస్ స్టేషన్ సీఐ ప్రత్యేక బృందంతో వెళ్లి అరెస్టు చేసి కోర్టులో హాజరు పర్చగా ఫస్ట్ అడిషనల్ జేఎఫ్‌సీ న్యాయమూర్తి ఉపనిషద్వని 14 రోజుల రిమాండ్ విధిస్తూ తీర్పుచెప్పినట్లు సీఐ తెలిపారు.

కుమారుడి ఫీజు చెల్లించలేక తండ్రి ఆత్మహత్యాయత్నం



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నర్సయ్య

నస్పూర్: ప్రైవేటు స్కూల్ యాజమాన్యం అడిగిన డబ్బులు చెల్లించలేక ఓ విద్యార్థి తండ్రి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన మంగళవారం పట్టణంలో చోటు చేసుకుంది. స్థానికులు, బాధితుడి భార్య సుమలత తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని సీసీసీ కార్నర్ శ్రీరాంనగర్‌కు చెందిన నేదురి నర్సయ్య, సుమలత దంపతుల కుమారుడు హర్షవర్థన్ స్థానిక డాన్ హైస్కూల్‌లో రెండోతరగతి వరకు చదివాడు. ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు పాఠశాలలో నాలుగోతరగతి చదువుతున్నాడు. నర్సయ్య సోమవారం డాన్ స్కూల్‌కు వెళ్లి సిబ్బందిని తమ కుమారుడి సర్టిఫికెట్లు ఇవ్వాలని కోరాడు. పెండింగ్ ఫీజు చెల్లిస్తేనే సర్టిఫికెట్లు ఇస్తామనడంతో కరస్పాండెంట్‌తో మాట్లాడుతానన్నాడు. దీంతో కరస్పాండెంటును పిలిపించడంతో ఫీజు చెల్లించాలని సూచించాడు. దీంతో మీరు అడిగినంత ఫీజు చెల్లించలేనని పాఠశాల బయటకు వెళ్లి అప్పటికే తనతో వెంట తెచ్చుకున్న చెదలు నివారణ మందుతాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన స్థానికులు 108కు సమాచారం అందించడంతో మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించడంతో చికిత్స పొందుతున్నాడు. తన భర్త ఆత్మహత్యాయత్నానికి కారణమైన పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని బాధితుడి భార్య సుమలత కోరుతోంది. కాగా పాఠశాల గుర్తింపును రద్దు చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీకాంత్, ఎంఎస్ఎఫ్ (మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్) జిల్లా ఇన్‌చార్జి కోంద్ర ఉదయ్ డిమాండ్ చేశారు. దీనిపై పాఠశాల కరస్పాండెంట్ విష్ణువర్ధన్ రెడ్డిని వివరణ కోరగా ఫీజు చెల్లించాలని నర్సయ్యను ఎలాంటి ఒత్తిడి చేయలేదన్నారు. కేవలం ఫీజు వివరాలు మాత్రమే తెలిపానన్నారు. ముందస్తు ప్లాన్ ప్రకారం కావాలనే తనవెంట క్రిమిసంహారక మందు తెచ్చుకున్నాడన్నారు.

ఆర్మీ జవాన్ పార్థీవదేహంతో ర్యాలీ



సుధాకర్‌సింగ్ (ఫైల్)



ర్యాలీగా తీసుకొస్తున్న యువకులు

నేరడిగొండ(బోథ్): మండలంలోని కిష్టాపూర్ గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ సోలంకి సుధాకర్ సింగ్ విధి నిర్వహణలో భాగంగా ఆదివారం కశ్మీర్‌లో గుండెపోటుతో హఠాన్మరణం పొందారు. పార్థీవ దేహాన్ని మంగళవారం సొంత గ్రామమైన కిష్టాపూర్‌కు తీసుకువచ్చారు. మండలంలోని బంధంరేగడి బైపాస్ నుండి స్థానిక యువత, నాయకులు బైక్ ర్యాలీ మధ్య నేరడిగొండకు తీసుకువచ్చారు. జెడ్పీటీసీ అనిల్ జాదవ్, తెలంగాణ అధ్యాపక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్, కాంగ్రెస్ నాయకులు ఆడే గజేందర్ పాల్గొని సుధాకర్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. బుధవారం కిష్టాపూర్‌లో అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

ఉరేసుకుని సింగరేణి కార్మికుడు ఆత్మహత్య

చెన్నూర్‌రూరల్: పట్టణంలోని ఆదర్శనగర్ కాలనీకి చెందిన వంగల రమణారెడ్డి (27)అనే సింగరేణి కార్మికుడు మంగళవారం రాత్రి కన్నెపల్లి సమీపంలో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తన చావుకు ఎవరూ కారణం కాదని, జీవితంపై విరక్తి చెంది చనిపోతున్నానని అతని సోదరితో పాటు స్నేహితుని ఫోన్‌కు మేసేజ్ పంపి ఆత్మహత్య చేసుకున్నాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఎల్లక్కపేటలోని చెన్నూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రమణారెడ్డి ఆర్కే 6 బొగ్గు గనిలో ట్రైనింగ్‌లో ఉన్నాడు. మృతుని తండ్రి నర్సింహారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.